ప్రజాశక్తి
బుధవారం 31 డిసెంబర్ 2025
7
శ్రీ సత్యసాయి

నేరాల నియంత్రణకు చర్యలు

- సాంకేతికతను వినియోగించి కేసుల ఛేదింపు
- పంచాయతీ ఎన్నికలకు ముందస్తు ప్రణాళికలు
- గతేడాదిలో రెండుశాతం నేరాల పెరుగుదల
- జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీసు శాఖ ద్వారా అన్ని చర్యలు తీసుకుంటామని, సాంకేతికతను వినియోగించి నేరాలను తగ్గించేందుకు కృషి చేయనున్నట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ అంకిత సురానితో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో నేరాల నియంత్రణకు భవిష్యత్తు ప్రణాళిక తయారు చేసుకున్నామని చెప్పారు. నైట్ విజన్, డే విజన్ డ్రోన్‌ల ద్వారా పటిష్టమైన పెట్రోలింగ్‌తో నేరస్థుల కదిలికలను గుర్తిస్తామన్నారు. సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత పెంచుతామన్నారు. వారధి ప్రోగ్రాం ద్వారా పోలీస్ అధికారులను ప్రజల వద్దకు పంపి వినూత్నంగా ప్రొజెక్టర్ సహాయంతో వీడియో, సినిమా క్లిప్పింగ్‌లు ప్రదర్శించడం ద్వారా ప్రజలను చైతన్యవంతులు చేస్తామన్నారు. రాబోవు పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి పంచాయతీకి సిబ్బందిని నియమిస్తూ ఆ గ్రామం పూర్తి బాధ్యతలను వారికి అప్పగిస్తూ గ్రామంలో అసాంఘిక శక్తుల కదిలికపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. పాత కేసుల్లో పాల్గొన్న వారిపై, వారు పాల్గొన్న నేరాల తీవ్రతను బట్టి జిల్లా బహిష్కరణ వేటు ఉంటుందన్నారు. అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగించడం ద్వారా ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే విధంగా చూస్తామన్నారు.

గతేడాదిలో రెండుశాతం పెరిగిన నేరాలు

2025 ఏడాదిలో నేరాల నమోదు రెండు శాతం పెరిగిందని, ఆస్తి సంబంధిత నేరాలు -మహిళలకు సంబంధించిన నేరాలు - మోసపూరిత నేరాలలో పెరుగుదల కనిపిస్తోందని, శారీరిక సంబంధిత నేరాలు, హత్యలు, కిడ్నాప్‌లలో స్వల్ప తగ్గుదల కనిపిస్తోందని ఎస్పీ తెలిపారు. రహదారి ప్రమాదాలో మరణాల సంఖ్య తగ్గి, గాయపడ్డ వారి సంఖ్య కొద్దిగా పెరిగిందన్నారు. హిందూపురం పట్టణ సమీపంలోని బ్యాంకు చోరీ కేసులో హర్యానా రాష్ట్రానికి చెందిన ఇద్దరు అంతరాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసి వారి నుంచి 5.5 కేజీల బంగారు ఆభరణాలను రికవరీ చేయడం జరిగిందన్నారు. రైతులు, వ్యాపారస్తులను పెద్ద ఎత్తున మోసాలకు గురిచేసి సుమారు 300 కోట్లు కాజేసిన దాల్మిల్ సూరిని అరెస్ట్ చేసి అతడి తమ్ముడు పాండు పై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. ఈ ఏడాదిలో జరిగిన శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రితో పాటు పలువురు గవర్నర్లు, ముఖ్యమంత్రిలు పాల్గొన్నారన్నారు. పోలీసులందరూ సమిష్టిగా ఇందులో పని చేసి విజయవంతం చేశారన్నారు. జిల్లా ధర్మవరం సబ్ డివిజన్‌కు ఈ ఏడాది ఎబిసిడి అవార్డు రావడం గర్వకారణం అన్నారు. 2026 ఏడాదిలో ఆధునిక పద్ధతులు, డ్రోన్ సాంకేతికతను అవలంభించి, తగిన సిబ్బందితో పహారాను బలోపేతం చేస్తామన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచుతామన్నారు.

నూతన సంవత్సర వేడుకల దష్ట్యా నిబంధనలు

నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతను దష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లావ్యాప్తంగా ప్రత్యేక పోస్టులు ఏర్పాటు చేసి, డ్రంక్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. డీజేలు ఏర్పాటుచేసి శబ్ద కాలుష్యం సృష్టించడం, మద్యం సేవించి గొడవలకు దిగడం, రహదారులపై కేక్ కట్ చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలిగించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇష్టా రీతిన రీల్స్ పోస్ట్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

హిందూపురం బజారులో అమ్మకానికి పెట్టిన కూరగాయాలు

కష్టపడి పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. అదే పంట వినియోగదారుడి చేతికి చేరేసరికి ఆకాశాన్ని అంటిన ధరలతో కనిపిస్తుంది. ఈ వ్యత్యాసానికి ప్రధాన కారణం మార్కెట్లో రాజ్యమేలుతున్న దళారీ వ్యవస్థ. కూరగాయల ధరలు రోజు రోజుకు ఎగబాకుతున్నాయి. ఏ కూరగాయలు కొందామన్న కేజీ రూ. 60కి తక్కువ రావడం లేదు. బీరకాయలు, బీన్స్, బీట్రూట్, చిక్కుడు కాయలు, టమోటా తదితర కూరగాయలు సెంచరీ కొడుతున్నాయి. కూరగాయల ధరలు పెరుగుదలకు ప్రకృతి వైపరీత్యాలతో పాటు సీజన్ అంశాలు కారణమవుతున్నాయి. నూతన సంవత్సరంతో పాటు సంక్రాంతి పండుగ వస్తున్న నేపథ్యంలో కూరగాయల వినియోగం అధికంగా ఉండడంతో ఇదే అదునుగా వ్యాపారులు అధిక ధరలకు కూరగాయలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రైతు నుంచి మాత్రం తక్కువ ధరకే కొంటూ వారికి అన్యాయం చేస్తున్నారు.

దళారీకి కాసులు.. రైతుకు కష్టాలు..!



- మార్కెట్‌లో అడుగడుగునా మోసం
- దళారుల చేతుల్లో రైతులు దగా
- కొండెక్కిన కూరగాయల ధరలు
- రైతులకు మాత్రం నామమాత్రపు ధరే

ప్రజాశక్తి-హిందూపురం

ఆరుగాలం కష్టపడి కంటికి రెప్పలా తన పంటను రైతులు కాపాడి మార్కెట్‌కు తీసుకొస్తే అక్కడ నిజమైన ధర నిర్ణయించే అధికారం అతనికి ఉండడం లేదు. దళారులు, మధ్యవర్తులు కలిసి మార్కెట్‌లో మాయను సష్టించి ధరలను కృత్రిమంగా తగ్గించి

టోకు మార్కెట్‌లో వ్యాపారం చేస్తున్న వ్యాపారులు

రైతులను నష్టపరుస్తున్నారు. పంట కోసం చేసిన పెట్టుబడులు సైతం రైతుకు దక్కని పరిస్థితి నెలకొంటోంది. అదే పంట పట్టణాల్లో ఉన్న వినియోగదారులు, మార్కెట్‌కు చేరే సరికి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ముఖ్యంగా కూరగాయల ధరలు సామాన్యుడి బడ్జెట్‌ను దాటిపోతున్నాయి. రైతు తక్కువకు అమ్మిన టమోట, ఉల్లి, మిర్చి వంటి కూరగాయలు వినియోగదారుడికి చేరేసరికి కొండెక్కి కూర్చొంటున్నాయి. ఈ ధరల పెరుగుదలకు సరైన నియంత్రణ లేకపోవడం, నిల్వలు, కత్రిమ కొరతలు సష్టించడం వంటి కారణాలు దీనికి ప్రధాన కారణం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 30 వేల ఎకరాల్లో కూరగాయలు సాగవుతున్నాయి. వీటిలో క్యాబేజీ, బెండకాయలు, దొండకాయలు, వంకాయలు, టమోటా, అనపకాయలు, చిక్కుడు కాయలు, తోటకూర, ముల్లంగి మునగ కాయలు, మిరప తదితర రకాల కూరగాయలు ఇక్కడే పండిస్తున్నారు. పక్కన ఉన్న కర్ణాటక రాష్ట్రం నుంచి ఎక్కువగా కూరగాయలు వస్తుండడంతో దళారులు, వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడ ఎక్కువ ధరకు అమ్మి లాభాలు పొందుతున్నారు.

మూడు రకాలుగా దోపిడీ

కూరగాయల విషయంలో వ్యాపారులు మూడు రకాలుగా దోపిడీ సాగిస్తున్నారు. రైతుల నుంచి టోకుగా తక్కువ ధరకు కొని వినియోగదారులకు అధిక ధరకు అమ్ముతున్నారు. కమిషన్ పేరుతో రైతుల నుంచి దోచుకుంటున్నారు. మరో వైపు తూకంలో మోసగిస్తున్నారు. అధికారులు ఎవరు మార్కెట్ వైపు కన్నెత్తి చూడకపోవడంతో వ్యాపారులు చెప్పింది ధర ఇచ్చిందే తూకం అన్నట్టుగా సాగుతోంది.

ప్రస్తుతం పట్టణంలో ధరలు

కూరగాయ రకం	కిలో ధర	కూరగాయ రకం	కిలో ధర
వంకాయలు	40	బీట్ రూట్	60
టమాట	70	ఉల్లిపాయలు	40
బెండకాయలు	60	బంగాళదుంపలు	40
కాకరకాయలు	60	అల్లం	80
బీరకాయలు	60	పచ్చిమిర్చి	100
క్యాబేజి	40	వెల్లుల్లి	200
చిక్కుడు కాయలు	100	గోరుచిక్కుడు కాయ	80
క్యారెట్	100	మునగకాడలు	400
దొండకాయలు	80	కేప్సికం	80
		కీరదోసకాయలు	30
		కంద దుంపలు	60
		ఆలసందాలు	60

మూతబడిన రైతు బజార్

వినియోగంలో లేని రైతు బజారులో ఉన్న పశువులు

హిందూపురం పట్టణంలో ఏర్పాటు చేసిన రైతు బజార్ మార్కెట్ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో మూతబడింది. అక్కడ ఏర్పాటు చేసిన గదులు వృథాగా మారాయి. అదే స్థలాన్ని కూరగాయల టోకు వ్యాపారులకు కేటాయించారు. చుట్టుపక్కల ఉన్న గ్రామాల రైతులు వారు పండించిన పంటను అర్ధరాత్రి సమయంలో చలిలో వణుకుతూ తెల్లవారుజామున మార్కెట్‌కు తీసుకొచ్చి దళారుల చేతుల్లో పెడుతున్నారు. వారు నిర్ణయించింది ధర... ఇచ్చిందే డబ్బు అన్న తరహాలో రైతుల నుంచి దళారులు కొనుగోలు చేస్తున్నారు. అదే రైతుబజార్ అందుబాటులో ఉంటే రైతులకు కొంతమేరైనా పంటకు గిట్టుబాటు ధర లభించి ఉండేది.

19న వేమన జయంత్యుత్సవాలు

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

వేమన ఆలయం వద్ద కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-గాండ్లపెంట

యోగవేమన జయంత్యుత్సవాలను జనవరి 19వ తేదీన ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మంగళవారం నాడు మండల పరిధిలోని కటారుపల్లి శ్రీ యోగివేమన ఆలయాన్ని సందర్శించారు. వేమన సమాధిని సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్‌కు వేమన పీఠాధిపతి తుంగనంద వేమారెడ్డి స్వాగతం పలికారు. వేమన జయంత్యుత్సవాలపై ఆలయ కమిటీ సభ్యులతో కలెక్టర్ మాట్లాడారు. 19న ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

కస్తూరిబా పాఠశాల తనిఖీ

కటారుపల్లి క్రాస్ వద్ద ఉన్న కేజీపీ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటగది, తాగునీరు, మురుగుదొడ్లు తదితర పరిసరాల పరిశీలించారు. విద్యార్థులతో అక్కడి సదుపాయాలు, వసతులపై మాట్లాడారు. 10, ఇంటర్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అన్ని సబ్జెక్టుల్లో వందశాతం ఉత్తీర్ణత రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ దుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ వద్దు

కరపత్రాలు విడుదల చేస్తున్న రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

పరిశ్రమల స్థాపన పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న బలవంతపు భూసేకరణను వెంటనే ఆపాలని ఓపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంకుమార్, రైతు సంఘం ధనాపురం వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నాడు భూసేకరణ చేస్తున్న గ్రామాల్లో రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు పరచాలని డిమాండ్ చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గంలో పారిశ్రామిక అవసరాల కోసమని ప్రభుత్వం మలుగూరు, చలివెందుల, రాచపల్లి, బాలంపల్లి, చెర్లోపల్లి, కొండూరు, లేపాక్షి ప్రాంతాల్లో, బలవంతపు భూసేకరణ చేస్తోందన్నారు. ఇది సరైన చర్య కాదని, వెంటనే సేకరణ ఆపాలని కోరారు. భూ సేకరణ తప్పని సరి అయితే 2013 కేంద్ర భూ సేకరణ చట్టం ప్రకారం తీసుకోవాలన్నారు. భూసేకరణ చేస్తున్న గ్రామాల్లో సామాజిక ఆర్థిక, సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజలు, రైతుల ఆమోదం తర్వాతను భూమిని తీసుకోవాలన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ రేటుకు నాలుగింతలు అదనంగా నష్టపరిహారం చెల్లించాలని తెలిపారు. భూసేకరణ చట్టంలోని నిబంధనరలన్నింటినీ అమలు చేయాలని కోరారు. అలాకాదని ప్రభుత్వం బలవంతంగా భూములు తీసుకోవాలని చూస్తే అడ్డుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సిద్ధారెడ్డి, జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతు సంఘం నాయకులు చలపతి, తూముకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం నాయకులు రవి కుమార్, ఒపిడిఆర్ నాయకులు శ్రీనివాసులు, జలసాధన సమితి నాయకులు ప్రసాద్, రమణ, సురేష్ పాల్గొన్నారు.

ఖాద్రీశుని దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు (ఇన్‌సెట్‌లో ఖాద్రీశుడు)

ఖాద్రీశుని సన్నిధిలో ముక్కోటి ఏకాదశి శోభ

కదిరికి పోటెత్తిన భక్తజనం

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి శోభ సంతరించుకుంది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దంపతులు, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జాయింట్ కలెక్టర్ భరద్వాజ్ మౌర్య వేర్వేరుగా ఉత్తర ద్వారం గుండా వెళ్లి స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్నాటక నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి వేకువజాము నుంచే శ్రీవారి దర్శన భాగ్యం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి వేకువజామున 3:30 గంటలకు ఉత్తర గోపురంలో స్వామి వారి మూర్తిని కొలువుదీర్చారు. భక్తులు శ్రీవారిని దర్శనం చేసుకుని నమో నరసింహ నామస్మరణ చేశారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రత్యేక పుష్పాలంకారంతో పాటు ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎమ్మెల్యే అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. అంతకుముందు ఆలయ ప్రవేశద్వారం వద్ద అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య కలెక్టర్‌కు స్వాగతం పలికారు. కలెక్టర్ వెంట కదిరి ఆర్డీవో వీవీఎస్ శర్మ, ఆలయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఖాద్రీశుడిని దర్శనం చేసుకుని బయటకు వస్తున్న ఎమ్మెల్యే కందికుంట

టిడిపి కార్యకర్తలకు సన్మానం

టిడిపి కార్యకర్తలను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

తెలుగుదేశం పార్టీలో అంకితభావంతో పనిచేసే కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్ తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలో వివిధ బూత్‌లకు చెందిన ఉత్తమ టిడిపి కార్యకర్తలను మంగళవారం సన్మానించారు. తెలుగు దేశం పార్టీ ఉత్తమ కార్యకర్తలుగా అవార్డులు పొందిన బుడ్డప్ప, బాబు, శ్రీధర్, షేక్ ఫజ్లురాహమాన్ (బాషా), సమీవుల్లా, రమేష్, బాబు రెడ్డి, మహబూబ్ బాషా, ఈశ్వరయ్య, ఐటిడిపి నవీన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కమిషన్ డైరెక్టర్ ఆర్ఎంఎస్ షఫీవుల్లా, హజ్ కమిటీ డైరెక్టర్ డైమండ్ బాబా, మైనారిటీ పట్టణ అధ్యక్షులు అన్వర్, బిసి సెల్ పట్టణ అధ్యక్షులు రాజు, 34 వార్డు ఇంచార్జ్ అమీన్, ఐటీడీపీ అసెంబ్లీ ఇన్‌ఛార్జి నజీర్, 4వ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ అమర్నాథ్, 32 యూనిట్ ఇన్‌ఛార్జ్ వెంకట రమణ, 4వ వార్డ్ ఇన్‌ఛార్జి అశోక్, 4వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షరీఫ్, పట్టణ కార్యదర్శి శ్రీధర్, బీసీ సెల్ అసెంబ్లీ కార్యదర్శి బిఎన్.మూర్తి, మైనారిటీ పట్టణ కార్యనిర్వహణ కార్యదర్శి ఖలీం, ఐటిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి షెక్షావలి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతంపై మిథున్ రెడ్డి దిశానిర్దేశం

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని హిందూపురం నియోజకవర్గం వైఎస్ఆర్‌సిపి ముఖ్య నేత గుడ్డంపల్లి వేణు రెడ్డి మంగళవారం తిరుపతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మిథున్ రెడ్డి హిందూపురం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో వైఎస్ఆర్‌సిపిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని నాయకులకు ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు బాలాజీ మనోహర్, నక్కలపల్లి శ్రీరామరెడ్డి, అమనుల్లా, కట్లబాషా, నాగేంద్ర పాల్గొన్నారు. అనంతరం నాయకులు పెదిరెడ్డి రామచంద్రా రెడ్డిని కలిశారు.



పురం నాయకులతో మాట్లాడుతున్న మిథున్ రెడ్డి

అర్హులందరికీ ఉచిత న్యాయ సహాయం

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రాజశేఖర్

టోల్ ఫ్రీ నెంబర్‌లను విడుదల చేస్తున్న రాజశేఖర్

ప్రజాశక్తి-హిందూపురం

అర్హత కలిగిన వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. మంగళవారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. కారాగారంలోని రిమాండ్ ఖైదీలకు ఆహార పదార్థాలను తయారు చేసేందుకు దిగుమతి చేసుకున్న నిత్యావసరాల నాణ్యతను పరిశీలించారు. దీనికి తోడు ఫిర్యాదులు పెట్టే, నీటి నాణ్యత, తయారుచేసిన ఆహార పదార్థాల నాణ్యతను ఆయన పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం రిమాండ్ ఖైదీలతో నేరుగా మాట్లాడారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉండి న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని ఖైదీలకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామన్నారు. అలాంటి ఖైదీలు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం న్యాయ సహాయం కోసం ఉన్నత న్యాయస్థానం విడుదల చేసిన టోల్ ఫ్రీ నెంబర్ల గోడపత్రికలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగర అధికారి హనుమన్న, న్యాయవాది నవేరా, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎపి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి జిల్లాలో కంది పంటను కనీస మద్దతు ధర రూ.8వేలతో కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసినట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎస్.గీతమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి రెండవ వారం నుంచి కొనుగోలును ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వానికి కందులు విక్రయించదలచిన రైతులు ముందుగా వారి పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈక్రాప్‌లో నమోదైన రైతుల నుంచి మాత్రమే కంది కొనుగోలు చేస్తామన్నారు. కంది పంట సాగు చేసిన రైతులు వారి పేర్లను ఆర్ఎస్‌కె ద్వారా సిఎం యాప్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయురాలు

కౌశల్ పోటీల్లో బిఎస్ఆర్ విద్యార్థిని సత్తా

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఇటీవల తిరుపతిలోని సంస్కృత విద్యాపీఠంలో జరిగిన రాష్ట్రస్థాయి కౌశల్ పోటీల్లో పట్టణంలోని సంజయ్‌నగర్‌లో ఉన్న బిఎస్ఆర్ ప్రభుత్వ బాలికల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బండారు చైతన్యలక్ష్మి ప్రతిభ చాటి రాష్ట్రస్థాయిలో నాల్గో స్థానం కైవసం చేసుకుందని ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిలక్ష్మి తెలిపారు. పాఠశాలలో మంగళవారం హెచ్ఎం మాట్లాడుతూ చైతన్యలక్ష్మి చదువుతో పాటు వివిధ రకాల పోటీల్లో రాణిస్తుందన్నారు. కౌశల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో నాల్గో స్థానం సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు. అలాగే కొత్తచెరువులో జరిగిన కార్యక్రమంలో డిఇఒ కిష్టప్ప నుంచి నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందుకుందన్నారు. ఉదయం పాఠ శాలలో ప్రార్థనా సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య చైతన్యలక్ష్మిని ప్రత్యేకంగా అభినం దించి, శుభాకాంక్షలు తెలిపారు. తమ పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. చైతన్యలక్ష్మిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయురాలు సుకన్యను అభినందించారు.

గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ : ఎంపిడిఒ

ఎంపిడిఒ మనోహర్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

గ్రామాలను సంపూర్ణంగా పరిశుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మండలంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం (స్పెషల్ శానిటేషన్ డ్రైవ్) అమలు చేస్తున్నట్లు ఎంపిడిఒ సాయి మనోహర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మవరం మండలంలోని పంచాయతీలోల ఈ నెల 26 నుంచి జనవరి 4వ తేదీ వరకూ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చెత్త తొలగింపు, తడి–పొడి చెత్త ఏర్పాటు, శాస్త్రీయ ఘన వ్యర్థాల నిర్వహణ, వర్మికంపోస్టు తయారీ, చెరువులు, కాలువలు వంటి నీటి వనరుల చుట్టూ పరిశుభ్రత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జనవరి 5వ తేదీ ప్రత్యేక గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత సాధించిన గ్రామాలను చెత్త రహిత గ్రామాలుగా ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు, ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల చురుకైన భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన గ్రామాలు సాధ్యమని తెలిపారు.

ముదిగుబ్బ ఎస్ఐగా కేతన్న

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల నూతన ఎస్ఐగా జి.కేతన్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ధర్మవరంలో ఎస్ఐగా పనిచేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన ట్రాఫిక్ సమస్యలను పర్యవేక్షించి వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడినా, మైనర్లు వాహనాలు నడిపినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శాంతి భద్రతలు, అసాంఘిక శక్తుల విషయంలో ఎలాంటి రాజీ ధోరణి ఉండదని స్పష్టం చేశారు. స్టేషన్‌కి సంబంధించిన పెండింగ్ కేసులను సిఐ శివరాముడుతో చర్చించి త్వరితగతిన పురోగతి సాధించేలా కృషి చేస్తానని తెలిపారు.

చెరువును పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని కొత్తపల్లి చెరువులో మట్టి అక్రమ తరలింపుపై దినపత్రికల్లో వరుస కథనాలు రావడం, ప్రతిపక్ష పార్టీల ఆందోళన నేపథ్యంలో మంగళవారం వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. మైనింగ్ ఇన్‌స్పెక్టర్, ఇరిగేషన్ ఇంజినీర్, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ సోమునాయక్ కలిసి మట్టి తరలింపు వల్ల చెరువులో పడిన గుంతలు, కూలిపోయిన చెట్లను పరిశీలించారు. మట్టి అక్రమ రవాణాదారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయా అధికారులు తెలిపారు.

మలకవేములలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల పరిధిలోని మలకవేముల గ్రామంలో పలు రోడ్లు చెత్త చెదారంతో నిండిపోయి దుర్వాసన కొడుతున్నాయని గ్రామస్తులు టిడిపి సీనియర్ నాయకులు బండి మల్లికార్జున దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఈ విషయాన్ని ఎంపిడిఒ శకుంతల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎంపిడిఒ ఆదేశాల మేరకు శానిటేషన్ సిబ్బంది గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పాటు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. అలాగే పాడైన వీధిలైట్ల స్థానంలో కొత్త లైట్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచి రమణ, పంచాయతీ కార్యదర్శి, శానిటేషన్ వర్కర్లు, టిడిపి నాయకులు సాయిబాబు, కె.రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నూతన సంవత్సర వేడుకల్లో పోలీసులు సూచించిన నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ హెచ్చరించారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి, జనవరి 1వ తేదీ నూతన సంవత్సర వేడకల నేపథ్యంలో ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎస్పీ పలు హెచ్చరికలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిరంతరం చేపడతా మన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. మొదటి నేరానికి రూ. 10వేల జరిమానా లేదా 6 నెలల వరకూ జైలు శిక్ష, పునరావృత నేరాలకు రూ. 15వేల జరిమానా లేదా రెండేళ్ల వరకూ జైలు శిక్ష విధిస్తామన్నారు. నేరస్థుల డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేయడం లేదా పూర్తిగా రద్దు చేస్తామన్నారు. ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, వీలింగ్, స్టంట్లు చేయడం, అధిక శబ్దం చేసే సైలెన్సర్లు వినియోగించడం లాంటి ఉల్లంఘనలకు పాల్పడితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహనం సీజ్ చేయడంతో పాటు, తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వాహన చోదకులు హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. స్పీడ్ లిమిట్ మించినా చర్యలుంటాయన్నారు. బాణసంచా పేల్చినా, డీజేలు ఏర్పాటు చేసినా, గొడవలకు పాల్పడినా, రోడ్లపై కేక్‌లు కట్ చేసినా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా, ట్రిపుల్ రైడింగ్, కేకలు వేయడం వంటి, తదితర ప్రజలకు అసౌకర్యం కలిగించే ఏ విధమైన చర్యలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వీడియోలు, రీల్స్ పోస్ట్ చేసినా కేసులు నమోదు

చేస్తామన్నారు. జిల్లా ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలను బాధ్యతాయుతంగా, శాంతియుతంగా, సురక్షితంగా జరుపుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ప్రచార పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అమడగూరు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి యథాతథంగా కార్మిక చట్టాలను అమలు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం సిఐటియు జిల్లా ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ ఉపాధ్యక్షుడు కుళ్లాయప్ప ఆధ్వర్యంలో అమడగూరులో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కుళ్లాయప్ప మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం నెలకు రూ. 26వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, బిల్డింగ్ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, హమాలీ, ఆటో, ప్రయివేట్, ట్రాన్స్‌పోర్ట్, తదితర కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. విద్య, వైద్యంను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, కనీస పెన్షన్ నెలకు రూ. 9వేలు ఇస్తూ ఒపిఎస్‌ను అమలు చేసి విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ నాయకులు కుళ్లాయప్ప, నాగప్ప, మారెప్ప, మురళి, సిఐటియు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్‌వైరు చోరీ

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలకేంద్రమైన బత్తలపల్లిలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరును ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రి పక్కన ఉన్న ఎయిర్ టెల్ టవర్ వద్ద టవర్ కోసం ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని 20 కిలోల కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. దాని విలువ రూ. 15వేలు ఉంటుందన్నారు. ట్రాన్స్‌కో అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ బావుల వద్ద సైతం విద్యుత్ పరికరాల చోరీలకు పాల్పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు.

పారదర్శకంగా రీసర్వే

ప్రజాశక్తి-అమడగూరు

రీసర్వే పారదర్శకంగా చేస్తామని, ఎలాంటి తప్పిదాలకు తావివ్వమని తహశీల్దార్ రామనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మహమ్మాదాబాద్, చినగానిపల్లి పంచాయతీల్లో త్వరలో నిర్వహించనున్న భూరీసర్వేపై రెవెన్యూ అధికారులు మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ జనవరి 2వ తేదీ నుంచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూములను రీసర్వే చేస్తామని, తద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రీసర్వేలో కొలతలు, సరిహద్దుల విషయంలో ఏదైనా పొరబాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం రీసర్వేపై రైతుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు రీసర్వే ప్రాముఖ్యతను వివరించారు. భూమి హక్కుల స్పష్టత, భూ వివాదాల పరిష్కారం, డిజిటల్ రికార్డుల నిర్వహణకు రీసర్వే కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

వరుస చోరీలు.. ప్రజలు బెంబేలు..!

ప్రజాశక్తి-గుడిబండ

ఇటీవల కాలంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరుస చోరీలు జరుగుతున్నాయి. దీంతో రైతులు, ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొన్ని రోజులుగా ఓ దుంగల ముఠా కోళ్లు, మేకలు, గేదెలను లక్ష్యంగా చేసుకుని రాత్రి వేళ చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయి స్తున్నారు. కొన్ని రోజుల క్రితం మందలపల్లి గ్రామంలో పాడి రైతు నారాయణప్ప తన ఇంటి ముందు రూ. 65వేల విలువ చేసే ఓ గేదెను కట్టేసి ఉంచగా గుర్తుతెలియ వ్యక్తులు తోలుకెళ్లారు. అదిమరువక ముందే అదే రైతు నారాయణప్పకు చెందిన రూ. 65 వేల విలువ చేసే 4 మేకలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. నెల రోజుల క్రితం ఎస్.రాయపురం గ్రామంలో భాగ్యమ్మ అనే మహిళకు చెందిన 3 కోళ్లు, మాలింగప్పకు చెందిన ఓ మేక, ఈరన్నకు చెందిన 3 కోళ్లు, నాగమ్మకు చెందిన 3 కోళ్లు చోరీకి గురైనట్లు బాధితులు వాపోయారు. అలాగే కెఎన్.పల్లి గ్రామంలో రామిరెడ్డికి చెందిన 15 మేకలను ఎత్తుకెళ్లారు. ఇలా గ్రామాల్లో రాత్రి వేళ మేకలు, గేదెలు, కోళ్లు చోరీకి గురవుతుండడంతో వాటి యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో రాత్రి వేళ గస్తీ పెంచి చోరీలను నియంత్రించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కెఎన్.పల్లిలో 15 మేకలు చోరీ

మండల పరిధిలోని కెఎన్.పల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డికి చెందిన 15 మేకలు సోమవారం రాత్రి చోరీకి గురైనట్లు బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను మేకలు మేపుతూ జీవనం సాగించేవాడినని, సోమవారం రాత్రి యధావిధిగా తన ఇంటి ముందున్న రొప్పంలో మేకలు తోలానన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి బయట గడియ పెట్టి 60 మేకల్లో 15 మేకలను ఎత్తుకెళ్లారన్నారు. వాటి విలువ రూ. 1.5 లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెనుకొండ

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూని యన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో పెనుకొండ నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు బాబావలి మాట్లాడుతూ కార్మికులకు 3 నెలలుగా బకాయి ఉన్న వేతనాలు చెల్లించాలని, సర్వీస్‌లో చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, డెత్ బెనిఫిట్స్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగ కల్పనలో భాగంగా కౌన్సిల్‌లో తీర్మానం చేశామన్నారు. బకాయి వేతనాలు త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేష్, సూరి, అశ్విని, నాగలక్ష్మి, రామాంజనమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు యుటిఎఫ్ మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి-పెనుకొండ

యుటిఎఫ్ రూపొందించిన పదో తరగతి మోడల్ పేపర్లను మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు సుధాకర్, నారాయణస్వామి, నబి, రవీంద్రనాథ్, ఉపేంద్ర ఆధ్వర్యంలో మాధవనాయుడు, ఎనుముల రామకృష్ణ, విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీని వాసులు సహకారంతో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాల, ఎపి ఎస్టీ గిరిజన పాఠశాల, మహాత్మగాంధీ గురుకుల పాఠశాలల్లో ఎంఇఒ సుధాకర్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మోడల్ పేపర్లతో విద్యార్థులు

వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

కొత్తచెరువులో దర్శనం చేసుకుంటున్న భక్తులు

హిందూపురంలో దర్శనం కోసం బారులుదీరిన జనం

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండల వ్యాప్తంగా మంగళవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పలు దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నకేశవపురంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. చెన్నకేశవస్వామి వివాహ వేడుకలను ఆలయ ధర్మకర్త ఉషారాణి, చెన్నారెడ్డి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. అలాగే కొత్తచెరువులోని సోమేశ్వరాలయం, సంగమేశ్వర ఆలయం, నాగుల కనుమ వద్ద వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బుక్కపట్నం : ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని బుక్కపట్నంలో వెలసిన అతి పురాతనమైన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక శోభ సంతరించుకుంది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రధాన అర్చకులు హరి స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి, ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించిన వెండి రథంలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలేపల్లి ప్రశాంత్ కుమార్ కుటుంబ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ముదిగుబ్బ : మండలంలోని మలక వేముల గ్రామంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు మలకవేమల గ్రామ ఇన్‌ఛార్జి బండి మల్లికార్జున కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శంకరాచారి, కిరణ్ కుమార్ రెడ్డి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో సందడిగా ఆలయాలు

హిందూపురం : పట్టణ, పరిసర ప్రాంతాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారా దర్శనం కోసం భక్తులు తెల్లవారుజాము నుండి బారులు తీరారు. పట్టణంలో ప్రసిద్ధిగాంచిన పేట వెంకటరమణ స్వామి దేవాలయంతో పాటు లక్ష్మీపురం బాలాజీ దేవాలయం, విద్యానగర్ విద్యానగర్ కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం, షిరిడి సాయిబాబా, శ్రీనివాస మందిరం, గుడ్డం రంగనాథ స్వామి దేవాలయం తదితర దేవాలయాల్లో ఉదయం నుండి ప్రత్యేక పూజాది కార్యక్రమాలను ప్రారంభించారు. దేవాలయాల్లో వెలసిన మూలవిరాట్లను వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఉత్తరద్వారంపై ఆశీనింప చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు దేవాలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ముందస్తుగా ఆయా దేవాలయాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవాలయాల్లో మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు క్యూలైన్లు, తాగునీరు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయగా, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న జెవివి నాయకులు

మద్యం, మత్తు జోలికెళ్లొద్దు

జెవివి గౌరవాధ్యక్షులు డాక్టర్ బషీర్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మద్యం, మత్తు పదార్థాలు లేని కొత్త సంవత్సరానికి స్వాగతం పలకాలని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బషీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని శాంతినగర్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరన డాక్టర్ బషీర్ విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. మద్యం, మత్తు పదార్థాలతో ఎంతో మంది జీవితాలు నాశనమై కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. కావున మీ పిల్లలు, వారి స్నేహితులు, వారి అలవాట్లు, వ్యవహార శైలిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండటం మీ కనీస బాధ్యత అన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన వారు బయట పడలేరన్నారు. డిసెంబర్ 31 పేరు చెప్పి వృథాగా ఖర్చు పెట్టే డబ్బును మీ బిడ్డల చదువు, భవిష్యత్తు కోసం దాచాలని సూచించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బాగా చదువుకుని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో కలిసి కొత్త సంవత్సర వేడుకలు ఆనందంగా జరుపుకో వాలన్నారు. అర్ధరాత్రి వరకూ బయటి తిరగడం, మద్యం తాగి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దన్నారు. ఈ కొత్త సంవత్సరం సందర్భంగా మీ జీవితాల్లో వెలుగు నింపే ఓ మంచి పనికి శ్రీకారం చుట్టాలన్నారు. 'ఈ రోజు నుంచీ మద్యం, మత్తు పదార్థాల జోలికి పోను' అని గట్టి నిర్ణయం తీసుకోండి.. అదే కొత్త సంవత్సరానికి నిజమైన ఆహ్వానమన్నారు. గంజాయి వ్యాపారానికి అడ్డుపడుతున్నారని నెల్లూరులో ఓ వ్యక్తిని హత్య చేశారంటే గంజాయి ముఠాలు ఎంతగా చెలరేగి పోతున్నాయో అర్థం చేసుకోవచ్చున్నారు. ప్రభుత్వాలు కూడా మద్యాన్ని విచ్చలవిడిగి అమ్మకాలు ప్రోత్సహిస్తున్నాయని, దీంతో యువత చెడిపోతోందన్నారు. కాబట్టి ప్రభుత్వ మద్యం అమ్మకాలను నియంత్రించాలన్నారు. యుటిఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణనాయక్ మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతులను చేసి సమాజ బాగు కోసం ఇలాంటి మంచి పనులు చేస్తున్న జెవివి కృషిని అభినందించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి లోకేష్, సురేష్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ప్రదీప్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జానకి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు

ప్రశంసాపత్రాలతో టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

టిడిపి అధిష్టానం ఆదేశించిన కార్యక్రమాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు దిగ్విజయంగా పూర్తి చేశారని నియోజకవర్గ నాయకులు పోతుకుంట లక్ష్మన్న, పరిసే సుధాకర్ తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ కోసం విశేషంగా కృషి చేసిన 135 మంది యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్ కన్వీనర్లకు మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో చంద్రబాబు, నారా లోకేష్ చిత్రాలతో ఉన్న ప్రశంసా పత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ పార్టీ ఆదేశించిన కార్యక్రమాలన్నింటినీ నిర్దేశిత సమయంలో పూర్తి చేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 72 వేల సభ్యత్వాలు నమోదు చేసి రికార్డు సృష్టించామన్నారు. ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి జెండాను రెపరెపలాడిస్తామన్నారు.

జాగ్రత్తలు పాటించండి : సిఐ

ప్రజాశక్తి-బత్తలపల్లి

నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ సూచించారు. వారు మంగళవారం స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'రాబోయే నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి పండుగ సంబరాల్లో అతిగా మద్యం తాగి, శబ్దాలు చేసేలా వాహనాలు నడపరాదన్నారు. ఇతరుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, రెచ్చగొట్టే కార్యక్రమాలకు పాల్పడినా, డీజే పెట్టినా చర్యలు తప్పవన్నారు. ఈ నెల 31వ రాత్రి 10 గంటల నుంచి 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నమూనాలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

నమూనాలు తయారు చేసిన విద్యార్థులు

పట్టణంలోని పిఎంశ్రీ ఎపి మోడల్ స్కూల్‌లో మంగళవారం ఆర్ట్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ప్రిన్సిపల్ పద్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు తయారుచేసిన ఆర్ట్, క్రాఫ్ట్ ఐటమ్స్, వీవింగ్, నీట్టింగ్, క్లే మోడల్స్ ప్రదర్శించామన్నారు. ముఖ్య అతిథిగా ఎంఇఒలు రాజేశ్వరి, గోపాల్ నాయక్ హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను చూసి వారి నైపుణ్యాన్ని ప్రశంసించారు. ఉత్తమ నమూనాలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం తోలుబొమ్మలాటను ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రబీ పంటలు, యూరియా వాడకంపై సదస్సు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ధర్మవరం రూరల్ పరిధిలోని పోతుల నాగేపల్లిపల్లి గ్రామంలో రబీ సీజన్‌లో పంటల సాగు, యూరియా వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ముస్తఫా మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులకు మాత్రమే యూరియా ఇవ్వాలని రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు పంట నమోదు చేసుకోవాలని సూచించారు. పంటల నమోదు ఆధారంగా అవసరం మేరకు గ్రామాల్లో ఎరువులు సరఫరా చేస్తామన్నారు. డిబిటి విధానంలో ఆధార్, బయోమెట్రిక్ ద్వారా రైతులకు ఎరువులు పంపిణీ చేస్తామన్నారు. రైతుల అవసరం మేరకు గొట్లూరు, బడనపల్లి, తుమ్మల, పోతులనాగేపల్లి, నేలకోట గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో యూరియా, ఎరువులు నిల్వ ఉంచామన్నారు. రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువులు వాడాలని సూచించారు. అధిక మోతాదులో యూరియా వాడడం వల్ల తెగుళ్ల ఉధృతి ఎక్కువై పంట రక్షణ కోసం మందుల పిచికారీకి అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుందని వివరించారు. సదస్సులో గ్రామ ఉద్యాన సహాయకుడు గంగాద్రి, రైతులు పాల్గొన్నారు.

యూరియాను పంపిణీ చేస్తున్న రైతుభరోసా కేంద్రం సిబ్బంది

'పురం' ఆసుపత్రిలో ప్రసూతి కష్టాలు..!

ఐదుగురు వైద్యులు ఉండాల్సిన చోట ఇద్దరే..
కొన్నేళ్లుగా గైనకాలజిస్టు కొరత.. ప్రసూతి కోసం వెళ్తే రెఫర్

హిందూపురంలోని మాతా శిశు అసుపత్రి

ప్రజాశక్తి-హిందూపురం

తల్లి, శిశు భద్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత. ఈ దిశగా తక్షణ చర్యలు చేపట్టకపోతే ఆ కుటుంబంపై పెను ప్రమాదం చూపుతుంది. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితే హిందూపురం మాత శిశు ఆసుపత్రిలో కన్పిస్తోంది. క్షేత్రస్థాయిలో సదుపాయాల అభివృద్ధి, సిబ్బంది నియామకాల్లో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ప్రమాదం కారణంగా ప్రాణాలు పోతున్నాయి. ఆదివారం నాడు ఆసుపత్రికి వచ్చిన ఓ గర్భిణి కాన్పు అనంతరం తీవ్ర రక్తస్రావం కావడంతో అనంతపురానికి రెఫర్ చేశారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మరణించింది. ఆమె కడుపున పుట్టిన నవజాత శిశువును ఇంటికి తీసుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మరణించింది. ఈ ఘటనతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పురం ఆసుపత్రిలోనే మెరుగైన వైద్యసేవలు అందించి ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదన్న భావన అందరిలోనూ వ్యక్తం అవుతోంది.

హిందూపురం జిల్లా ఆస్పత్రిలో గైనకాలజిస్టుల కొరత వెంటాడుతుంది. 5 మంది గైనకాలజిస్టుల అవసరం ఉండగా కేవలం ఒక్కరు మాత్రమే విధుల్లో ఉన్నారు. ప్రసూతి కోసం వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఉన్న డాక్టర్, సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోంది. అందరికి ఒకే సమయంలో వైద్యసేవలు అందించలేక కొంత మందిని వేరే ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో రోగులు ప్రయివేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. అక్కడ కాన్పు కోసం వేలకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. దీనంతటికీ హిందూపురం జిల్లా ఆసుపత్రిలో గైనకాలజిస్టుల కొరతే కారణంగా కన్పిస్తోంది. ఈ విభాగంలో సివిల్ సర్జన్ ఒకరు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు ముగ్గురుతో స్త్రీల ప్రత్యేక వైద్య నిపుణులు ఉండాల్సి ఉంది. మాత శిశు ఆసుపత్రి జాతీయ ఆరోగ్య మిషన్ నడుస్తోంది. దీని కోసం జాతీయ ఆరోగ్య మిషన్ తరుపున 5 మంది గైనకాలజిస్టుల పోస్టులు భర్తీ చేస్తే, రాష్ట్ర వైద్య ఆరోగ్య విధాన పరిషత్ తరఫున మరో ముగ్గురు మొత్తం 8 మంది ఉంటారు. ప్రస్తుతం జాతీయ ఆరోగ్య

ఆసుపత్రిలో వైద్యం కోసం వేచివున్న గర్భిణులు

మిషన్ తరఫున ఒక్కరు కూడా లేరు. ఉన్న ఇద్దరు ఒకరు నైట్ డ్యూటీ ఓపీ చూసి వెళ్తారు. దీంతో పని భారం ఇద్దరిపై ఎక్కువగా పడుతోంది. పనిభారంతో ఉన్నా ఇద్దరు వైద్యులు దీర్ఘకాలిక సెలవులో వెళ్లడానికి సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఇందులో ఎవరు సెలవులో వెళ్లినా మాత శిశు ఆసుపత్రిలో అందే అరకొర సేవలు సైతం అందక గర్భిణులు ఇబ్బందులు పడే పరిస్థితులు కన్పిస్తున్నాయి. జిల్లా కలెక్టర్‌తో పాటు వైద్య విధానపరిషత్ అధికారులు ప్రస్తుతం హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్టుల పోస్టులను భర్తీ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలా కాని పక్షంలో ఏరియా ఆసుపత్రుల్లో గైనకాలజిస్టులు ఉంటే వారిని డిప్యూటేషన్ విధానంలో ఇక్కడికి బదిలీ చేస్తే మాత శిశు ఆసుపత్రిలో గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందే అవకాశాలు ఉన్నాయి.

కాన్పుల కన్న రెఫర్ల సంఖ్య ఎక్కువ

హిందూపురం జిల్లా ఆస్పత్రిలోని మహిళా విభాగం ఓపీకి సరాసరి రోజుకు వంద మంది పైగా రోగులు వస్తుంటారు. గతంలో కాన్పుల విభాగంలో నెలకు 250కి పైగానే కాన్పులు జరిగేవి. అందులో సుమారు 60 దాకా శస్త్రచికిత్సల కాన్పులు జరిగేవి. గైనకాలజిస్టుల కొరత కారణంగా కాన్పుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ ఉన్నాయి. ఈ సంవత్సరం జనవరి నెల నుంచి జరిగిన కాన్పుల గణాంకాలను పరిశీలిస్తే జనవరిలో 516 మందిని కాన్పు కోసం ఆసుపత్రిలో అడ్మిషన్ కాగ 118 మంది సాధారణ కాన్పులు, 69 సిజేరియన్ మొత్తం 187 కాన్పులు జరిగాయి. మిగిలిన వారిని రెఫర్ చేశారు. ఫిబ్రవరిలో 470 మందికి గాను 126 సాధారణ కాన్పులు, 78 సిజేరియన్ మొత్తం 204 కాన్పులు జరిగాయి. మార్చిలో 457 మందికి గాను 122 సాధారణ కాన్పులు, 51 సిజేరియన్ మొత్తం 173 కాన్పులు జరిగాయి. ఏప్రిల్‌లో 423 మందికి గాను 128 సాధారణ కాన్పులు, 31 సిజేరియన్ మొత్తం 160 కాన్పులు జరిగాయి. మేలో 377 మందికి గాను 109 సాధారణ కాన్పులు చేశారు. సిజేరియన్ 19 మొత్తం 128 కాన్పులు జరిగాయి. జూన్‌లో 404 మందికి గాను 149 సాధారణ కాన్పులు, సిజేరియన్ కాన్పులు 32 మొత్తం 181 కాన్పులు జరిగాయి. జూలైలో 345 మందికి గాను 105 సాధారణ కాన్పులు, సిజేరియన్ కాన్పులు 30 మొత్తం 136 కాన్పులు జరిగాయి. ఆగస్టులో 271 మందికి గాను 130 సాధారణ కాన్పులు, సిజేరియన్ కాన్పులు 28 మొత్తం 159 కాన్పులు జరిగాయి. సెప్టెంబర్‌లో 346 మందికి గాను 142 సాధారణ కాన్పులు, సిజేరియన్ కాన్పులు 51 మొత్తం 194 కాన్పులు జరిగాయి. అక్టోబర్‌లో 319 మందికి గాను 140 సాధారణ కాన్పులు, సిజేరియన్ కాన్పులు 39 మొత్తం 179 కాన్పులు జరిగాయి. నవంబర్‌లో 289 మందికి గాను 138 సాధారణ కాన్పులు, సిజేరియన్ కాన్పులు 47 మొత్తం 185 కాన్పులు జరిగాయి. దీనిని బట్టి చూస్తే ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన కాన్పుల కన్న రెఫర్ చేసిన సంఖ్య ఎక్కువ ఉంది. వీటితో పాటు ఆసుపత్రికి వచ్చిన రోగులను వచ్చినట్లే రెఫర్ చేసిన సంఖ్య చూస్తే ఇక్కడ నమోదు చేయరు. దానిని బట్టి చేస్తే మాత శిశు అసుపత్రి కేవలం టోల్‌గేట్ తరహా ఉన్నట్లు తెలుస్తోంది. వైద్యులు కొరత ఉండడంతో రాత్రి వేళ వైద్యులు అందుబాటులో లేక పోవడంతో కాన్పుల కోసం రాత్రి వేళల్లో జిల్లా ఆస్పత్రికి వస్తే రెఫర్ చేయడం పరిపాటిగా మారిందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీపీ ఎక్కువగా ఉంటే తగ్గించేందుకు ఇంజెక్షన్లు కూడా ఆసుపత్రిలో లేనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారులు ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పురం ఆసుపత్రిలో గైనకాలజిస్టులు, సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యను ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లాం
డాక్టర్ అన్నపూర్ణ, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్.

జిల్లా ఆస్పత్రిలో గైనకాలజిస్టులు ఇద్దరు ఉన్నారు. నిబంధనల మేరకు ఇంకా 6 మంది అవసరం ఉంది. గైనకాలజిస్టులు లేకనే కాన్పుల సంఖ్య తగ్గింది. ఉన్న ఇద్దరు వైద్యులతోనే కాన్పులు చేస్తున్నాం. సమస్యను ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లాను. గైనకాలజిస్టులను ఏర్పాటు చేస్తామని వారు చెబుతున్నారు. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

కలెక్టర్ దృష్టి సారించాలి

హిందూపురం అసుపత్రికి జిల్లా స్థాయి హోదా ఉన్నప్పటికీ సౌకర్యాలు లేవు. ముఖ్యంగా మాత శిశు విభాగంలో గైనకాలజిస్టుల కొరత తీవ్రంగా ఉండడంతో కాన్పుల కోసం వచ్చే గర్భిణష్త్రులు ఇబ్బంది పడుతున్నారు. పూర్తిస్థాయిలో వైద్యులు లేక పోవడంతో ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వెంటనే గైనకాలజిస్టులను నియమించే దిశగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.

- జెడ్‌పి శ్రీనివాసులు సిపిఎం జిల్లా నాయకులు

'ఉపాధి', నీటి సంరక్షణ, అభివృద్ధి పనులను

సమర్థవంతంగా అమలు చేయాలి

అధికారులకు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో ఉపాధి హామీ చట్టం పనులు, నీటి సంరక్షణ కార్యక్రమాలు, ఇసుక అక్రమ తవ్వకాల నియంత్రణతో పాటు గ్రామీణాభివృద్ధి పనులను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ ఉంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా డ్వామా, ఇరిగేషన్, భూగర్భ జలాలు, హెచ్ఎన్ఎస్ఎస్, హెచ్ఎల్‌సి అధికారులతో జిల్లాస్థాయి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న ఉపాధి పనులు ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఫొటోలు, జియో-ట్యాగింగ్, లాట్-లాంగ్ వివరాలతో రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. చెరువులు, కాలువలు, చెక్‌డ్యాంలు, ఫీడర్ ఛానళ్లు, ఫారం పాండ్లు, రీఛార్జ్ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. 'వన్ బోర్ వెల్-వన్ రీఛార్జ్ స్ట్రక్చర్', రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్, వంటి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇసుక అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, నేచురల్ రీసోర్సెస్ నుంచి ఇసుక తవ్వకాలపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. అవసరమైన చోట డ్రోన్ మ్యాపింగ్ నిర్వహించి అక్రమ కార్యకలాపా లను అరికట్టాలని సూచించారు. పనుల అమలులో పారదర్శకత, నాణ్యత ఉండాలని, ప్రజాధనం వృథా కాకుండా ప్రతి అధికారి బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. జిల్లాలో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా పిడి, ఎపిడిలు, ఎపిఒలు, ఉపాధి హామీ చట్టం సిబ్బంది, నీటిపారుదల శాఖ ఎస్ఈ, ఈఈ, భూగర్భ జలాల శాఖ ఎడి, హెచ్ఎన్ఎస్ఎస్, హెచ్ఎల్‌సి విభాగాల అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

పింఛన్లు వందశాతం పంపిణీ చేయాలి : కలెక్టర్

ఈ నెల 31వ తేదీనే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 2,62,533 మంది పింఛనుదారులకు 4,472 మంది సిబ్బందితో రూ. 115.51 కోట్ల నగదు పంపిణీ చేస్తామన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎలాంటి సమస్యలు తలెత్తకూడదని, లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారితో మర్యాదపూర్వకంగా మాట్లాడి పింఛను మొత్తం అందజేయాలన్నారు. లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదన్నారు. లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేయరాదన్నారు. అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పింఛన్ల పంపిణీని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డిఆర్‌డిఎ, వెలుగు ఎపిడిలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులు నడయాడిన నేల 'సేవామందిర్'

వ్యవస్థాపక దినోత్సవంలో తులసిరెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి-పరిగి

స్వాతంత్ర్య సమరయోధులు నడయాడిన నేల 'సేవామందిర్' అని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సేవామందిర్ సంస్థ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం సంస్థ అధ్యక్షుడు కెటి.శ్రీధర్ ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షణీయంగా నిలిచాయి. తులసిరెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది స్వాతం త్ర్య సమరయోధులతో సంబంధం ఉన్న సేవా మందిర్ సంస్థ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వక్తలు మాట్లాడుతూ సేవా మందిర్ కేంద్రంగా ఎంతో మంది స్వాతంత్ర్య సమరయోధులు ఆశ్రయంగా నిలిచి పోరాటానికి బలం చేకూర్చిన ప్రాంతం అన్నారు. ఈ ప్రాంతంలో విద్యాసంస్థలు ఏర్పాటు చేసి ఎంతోమంది ఉత్తమ భవిష్యత్తుకు తోడ్పాటు అందిస్తున్న కెటీ శ్రీధర్‌ను అభినందించారు. ఎన్నో ప్రయివేట్ విద్యాసంస్థలు ఆదాయ కేంద్రాలుగా మార్చుకుంటున్న ఈ సమయంలో లాభార్జన లేకుండా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలతో పాటు వృత్తి విద్య కోర్సులను నిర్వహిస్తుండటం గొప్ప విషయం అన్నారు. లింగన్న ఆశయాలను ముందుకు తీసుకెళున్న కెటీ శ్రీధర్‌కు తామంతా అండగా ఉంటామని, ఆయన ఆశయాలకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అనంతపురం విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు డా. బి.నారాయణ, దుత్తలూరి బాబు బాలాజీ, పరిగి ఏంఈఓలు గోపాల్ ,లక్ష్మీదేవి,శేషాచలం తదితరులు పాల్గొన్నారు.

పాలపాటిదిన్నె అంజన్నను దర్శించుకున్న కలెక్టర్

కలెక్టర్‌కు స్వామి చిత్రం పటం అందజేస్తున్న అర్చకులు

ప్రజాశక్తి-నల్లచెరువు

మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామిని మంగళవారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు కలెక్టర్‌కు ఆహ్వాం పలికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌ను అర్చకులు శాలువాతో సన్మానించి ఆంజనేయస్వామి చిత్రపటాన్ని బహుకరించారు. ఆయన వెంట అర్చకులు నాగరాజు, ఆంజనేయ దాసు, రెడ్డప్ప, తదితరులు ఉన్నారు.

ముదిగుబ్బలో నేత్రదానం

రంగయ్యశెట్టి నేత్రాలు సేకరించిన వైద్యులు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక మెయిన్ రోడ్డులో ఆర్యవైశ్య సమాజానికి చెందిన చిలమకూరి రంగయ్యశెట్టి వృద్ధాప్య కారణాలతో మంగళవారం మృతి చెందారు. దీంతో ఆయన మనవడు రిత్విక్ తన తాత చివరి కోరిక అయిన ఆయన నేత్రాలను దానం చేసి పలువురి ప్రశంసలు అందుకున్నారు. రిత్విక్ మాట్లాడుతూ మా తాత సమాజం పట్ల సేవాభావంతో మెలిగిన వ్యక్తి అని, మనం చనిపోయినా, కొందరికైనా మంచి చేయాలనే తపన కలిగి ఉండేవారన్నారు. తన కళ్లు దానం చేసి ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరేవారని తెలిపారు. దీంతో అనంతపురానికి చెందిన ప్రాణ దాత స్వచ్ఛంద సంస్థకు సమాచారం ఇవ్వగా డాక్టర్లు, సంస్థ ప్రతినిధులు వచ్చి నేత్రాలను సేకరించారని తెలిపారు.

హాకీ పోటీల్లో గొట్లూరు విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఆర్‌డిటి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాలికల హాకీ లీగ్ పోటీల్లో మండల పరిధిలోని గొట్లూరు హైస్కూల్ విద్యార్థులు విజేతలు నిలిచినట్లు హెచ్ఎం జగన్నాథం, ఫిజికల్ డైరెక్టర్ రమేష్ బాబు తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జరిగిన జిల్లాస్థాయి ఆర్‌డిటి అండర్-14 బాలికల హాకీ లీగ్ ఫైనల్స్‌లో తమ విద్యార్థినులు గడేకల్లు జట్టుపై 4-0 గోల్స్ తేడాలో ఘనవిజయం సాధించి జిల్లా విజేతగా నిలిచారన్నారు. వారిని హెచ్ఎం, పిడితో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.

హాకీ పోటీల్లో గెలిచిన గొట్లూరు హైస్కూల్ విద్యార్థినులు

పంచాయతీ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని చిన్న మంతూరు గ్రామపంచాయతీలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై మంగళవారం ఆ గ్రామస్తులు తహశీల్దార్ ఉదయ శంకర్‌రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చిన్నమంతూరు గ్రామంలోనీ సర్వే నెంబర్ 60లో ఉన్న ప్రభుత్వ భూమిని రైతులు ఎన్నో ఏళ్లుగా వినియోగించుకుంటున్నారన్నారు. అయితే సర్పంచి తనయుడుతో పాటు రామచంద్రరెడ్డి అనే వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారన్నారు. అలాగే దేవుని మాన్యం సర్వే నంబర్ 20-5లోని ఎకరా భూమిని సర్పంచి తన కుమారుడైన రిత్విన్ కుమార్ రెడ్డి పేరిట దొంగ పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. ఆయా భూములపై విచారణ చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.


తహశీల్దార్ ఉదయశంకర్‌రాజ్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

వ్యవస్థలో లోపాలకు ఉపాధ్యాయులను బలిచేయొద్దు

వైఎస్‌ఆర్‌టిఎ జిల్లా అధ్యక్షులు పివి రమణారెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వ్యవస్థలో లోపాలకు ఉపాధ్యాయులను బలి చేయడం తగదని వైఎస్‌ఆర్‌టిఎ జిల్లా అధ్యక్షులు పివి రమణారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన డిఇఒ క్రిష్టప్పకు వినతిపత్రం అందజేశారు. రమణారెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో గుడ్డు చిన్నగా ఉన్న దానికి, సప్లై చేయకపోవడానికి ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం తగదన్నారు. పదో తరగతి విద్యార్థుల వంద రోజుల కార్యక్రమంలో పిల్లలు, ఉపాధ్యాయులకు సెలవు రోజులు మినహాయించాలని కోరారు. నిత్యం ఏదో ఒక ఆన్‌లైన్ కార్యక్రమం, బోధనేతర కార్యక్రమాలకు ఉపాధ్యాయులను వినియోగించడం శోచనీయమన్నారు. అనవసర యాప్‌లను తొలగించి ఉపాధ్యాయులను ప్రశాంతంగా బోధన చేసే విధంగా చూడాలని కోరారు. అసెస్మెంట్‌ను పలు రకాలుగా ఎంటర్ చేసే విధానాన్ని అరికట్టాలన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో జి ఎఫ్ ఎల్ ఎన్, టి ఎ ఆర్ ఎల్, ఎఫ్ ఎ, ఎస్ ఎ లు నిత్యం పరీక్షలు, వాటి కరెక్షన్, అప్లోడ్, డైరీ లెసన్ ప్లాన్, తదితర వాటితో సిలబస్ పూర్తి చేయలేక ఉపాధ్యాయులు నిత్యం మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. విద్యార్థులు తక్కువగా ఉన్నారని ఏ పాఠశాలను మూసివేయద్దని కోరారు. ఓహెచ్ సగం మంది ఉపాధ్యాయులకు కాకుండా పాఠశాల మొత్తానికి ఇవ్వాలని కోరారు. ఇలా పలు సమస్యలతో సతమతమవుతున్న ఉపాధ్యాయులను ప్రశాంతంగా పాఠాలు చెప్పే అవకాశాన్ని కల్పించి పేద మధ్యతరగతి ప్రభుత్వ పాఠశాలను బ్రతకనివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ప్రకాష్ రెడ్డి, రామమోహన్ రెడ్డి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పరిగి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్ర కౌన్సిలర్ మహంతేశ్వర, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ ఓబులేష్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులు సత్యవతి, ప్రధాన కార్యదర్శి సురేష్ సమక్షంలో ఎంఇఒలు లక్ష్మీదేవి, శేషాచలం, ప్రధానోపాధ్యాయులు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు కృపాసత్యరాజ్ యుటిఎఫ్ కాలమాణిని, డైరీని విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. ఏ ఇబ్బంది కలిగినా యుటిఎఫ్ వెన్నంటి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షులు బాబాఫక్రుద్దీన్, యుటిఎఫ్ సభ్యులు శంకరప్ప, రామకృష్ణ, హనుమంతప్ప, సుల్తాన్, శేఖర్, విశ్వనాథ్, సోమశేఖర్, సుకన్య, సరస్వతి, రామాంజనేయులు, వినోద్, జహీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ కేటాయింపుల్లో సమన్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి-బుక్కపట్నం

బుక్కపట్నం మేజర్ పంచాయతీని విడదీసిన సందర్భంలో బుక్కపట్నం గ్రామానికి భూ కేటాయింపుల్లో సరైన న్యాయం జరగలేదని, అసంపూర్తిగా గ్రామపంచాయతీని విడదీశారని భూ కేటాయింపులలో న్యాయం చేయాలని కోరుతూ సర్పంచి నాగలక్ష్మిరాజు ఆధ్వర్యంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ 1970కి పూర్వం బుక్కపట్నం మండల కేంద్రంగా మేజర్ పంచాయతీగా కొనసాగుతూ వస్తుందన్నారు. 2019లో బుక్కపట్నం పంచాయతీని విడదీసే క్రమంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో స్పెషల్ ఆఫీసర్ పాలన వల్ల అసంపూర్తిగా విడదీశారని వివరించారు. తగిన న్యాయం చేసి పంచాయతీ అభివృద్ధికి దోహదపడాలని కోరారు. జనాభా ప్రాతిపదికన పంచాయతీ గ్రామాలను విడదీయాలని, లేనిచో మునుపటిలాగే గ్రామపంచాయతీని కలపాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశతకి-బత్తలపల్లి

మండలంలో సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను మంగళవారం టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్యం పాలైన వారికి ఈ నగదు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వేల్పుమడుగు గ్రామానికి చెందిన బోయ వెంగమునికి రూ. 1,22,500, బత్తలపల్లి హెడ్ క్వార్టర్ నివాసి బోయపాటి రామమూర్తికి రూ. 43,350, మాల్యవంతం పంచాయతీ యూనిట్ ఇన్‌ఛార్జి ఎం.చెర్లోపల్లికి చెందిన చిత్రా నాగభూషణకు రూ. 20వేల విలువ చేసే చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెట్టెం రమణ, హేమంత్ రెడ్డి, గోపాల్, డేరంగుల హరి, చల్లా నాయుడు, కప్పల బాలకృష్ణ, చల్లా లోకనాథ్, పాల్గొన్నారు.

పౌరులందరికీ సమాన హక్కులు

ప్రజాశక్తి-లేపాక్షి

సమాజంలోని పౌరులందరికీ సమాన హక్కులు ఉంటాయని తహశీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని కల్లూరు గ్రామంలోని అంబేద్కర్ కాలనీలో మంగళవారం తహశీల్దార్ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టిలో అందరూ సమానమేనని, రాజ్యాంగం ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. కుల మతాలకు అతీతంగా అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వం ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుర్గయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రమీలమ్మ, గ్రామ రెవెన్యూ అధికారిణి అంకిత, ఎఎస్ఐ షర్ఫుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ సౌజన్యలక్ష్మి

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే కళాశాల(బాలికలు)లో ఇంగ్లీష్ అధ్యాపకుల పోస్టుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ మంజుల తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇంగ్లీష్ బోధించేందుకు అనుభవం, నైపుణ్యం కలిగిన మహిళా లెక్చరర్ (గెస్ట్) కావాలన్నారు. సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్/బీఈడీ టెట్ పాసై ఉండాలన్నారు. నెలకు రూ. 24 వేల వేతనం ఉంటుందన్నారు. వివరాలకు mjpapbcwrjcgudibanda@gmail.com, 63037 45918లో సంప్రదించాలన్నారు.

ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలి

ప్రజాశక్తి- చిలమత్తూరు

వారంలో ఐదు రోజుల పని దినాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బ్యాంకు ఉద్యోగులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఎస్‌బిఐ ఎదుట నిర్వహించిన ఈ నిరసనలో ఉద్యోగులు పాల్గొన్నారు. ఉద్యోగులపై రోజురోజుకూ పనిభారం పెరుగుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఐదు రోజుల పనిదినాల అమలును పెండింగ్‌లో పెట్టడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి సిపిఎం నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మద్దతు తెలిపారు. కార్మికులు, ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఐదు రోజుల పనిదినాల అమలుతో ఉద్యోగులకు మానసిక ఉపశమనం కలుగుతుందని, సేవల నాణ్యత మెరుగుపడుతుందన్నారు.

వృద్ధుల ఇళ్ల వద్దకే రేషన్ : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

65ఏళ్లు పైబడిన రేషన్‌కార్డుదారులకు ఇంటివద్దకే రేషన్ పంపిణీ చేయాలని ఆర్డీవో మహేష్ డీలర్లను ఆదేశించారు. ఆర్‌డిఒ మంగళవారం పట్టణంలోని పలు రేషన్‌షాపులను సందర్శించి వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అర్హులైన కార్డుదారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా నిర్ణీత కాలంలో క్రమబద్ధంగా ఇంటి వద్దకే రేషన్ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కేటాయింపు, పంపిణీ, లబ్ధిదారుల అంగీకారాలు, నిల్వల రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సిఎస్‌డిటి చెన్నకేశవనాయుడు, రేషన్ షాపు డీలర్లు ఉన్నారు.

2 నుంచి గ్రామసభలు

ప్రజాశక్తి-పరిగి

మండలంలో గతంలో రీసర్వే పూర్తయిన పంచాయతీ గ్రామాల్లో భూ యాజమానులకు నూతన పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ హనుమంతు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 2వ తేదీ కొడిగెనహళ్లి, 3న శాసనకోట, 6న విట్టాపల్లి, 7న గణపతిపల్లి, 8న శ్రీరంగరాజుపల్లి, 9న బీచిగానిపల్లి గ్రామాల్లో పంపిణీ చేస్తామన్నారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకాలు పొందాలని సూచించారు. పేరు, సర్వే నంబర్, భూమి వివరాల్లో తప్పులు ఉంటే తహశీల్దార్ కార్యాలయంలో విజ్ఞప్తి చేయవచ్చని, వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సిఐని కలిసిన టిడిపి నాయకులు

సిఐని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నల్లమాడ

నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌గౌడ్‌ను మంగళవారం టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిఐని కలిసిన వారిలో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, బడా రమణారెడ్డి, సలాం ఖాన్, పటాన్ బాబావాలి, రామచంద్ర, నాగేంద్ర ఉన్నారు.

ధర్మవరం చెరువులో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం చెరువు ఒకటవ మరువ వద్ద మంగళవారం గుర్తు తెలియని పురుషుని మృతదేహం నీటిలో తేలియడుతూ బయట పడిందని 1వ పట్టణ పోలీసులు తెలిపారు. అతడి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు ఉండవచ్చని తెలిపారు. గుర్తించిన వారు వెంటనే 1వ పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ 94407 96831కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రైల్వే స్టేషన్‌లో వ్యక్తి...

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం రైల్వే స్టేషన్ పార్సిల్ కార్యాలయం సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు.. రైల్వే స్టేషన్ పార్సిల్ కార్యాలయం సమీపంలో సుమారు 45 ఏళ్లు కలిగిన ఓ వ్యక్తి స్పృహ తప్పి పడి వుండగా రైల్వే స్టేషన్ ఆన్ డ్యూటీ డాక్టర్ చెక్ చేసి అతడు మృతిచెందినట్లు తెలిపారు. ఆ వ్యక్తి ఆచూకీ తెలిస్తే రైల్వే పోలీసులు 89786 56463, 9951 3 25345లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం

అక్రమ కేసులు పెడితే బయట ఉండేవారు కాదు..-ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలకు ఉత్తమ కార్యకర్త ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే అందరినీ ప్రత్యేకంగా అభినందిస్తూ..కార్యక్రమాన్ని ఇంత పెద్ద ఎత్తున విజయవంతం చేసిన వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గాన్ని పార్లమెంటు పరిధిలో అగ్రస్థానంలో నిలిపారన్నారు. అలాగే సూపర్ సిక్స్ - హిట్ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేశారన్నారు. ఏ కార్యక్రమాన్ని పార్టీ ఆదేశించినా.. అర్బన్ నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులు దిగ్విజయం చేస్తున్నారన్నారు. అలాగే సభ్యత్వ నమోదులో చరిత్రలో ఎప్పుడు లేని విధంగా ఒక రికార్డు సృష్టించారన్నారు పార్టీ కోసం పని చేస్తున్న ఏ ఒక్కరినీ విస్మరించమని.. వారికి తగిన న్యాయం చేస్తామన్నారు. మనకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలే టార్గెట్ అని ఎమ్మెల్యే అన్నారు. అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లు, నాలుగు పంచాయతీలు మనమే విజయం సాధించాలన్నారు. కనీసం వైసిపి వారు నామినేషన్ వేయాలంటేనే ప్రజలు ఒప్పుకోరు అన్న విధంగా మన ప్రచార కార్యక్రమాలు ఉండాలన్నారు. ఈ 18 నెలల కాలంలో ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఇప్పటినుంచే ఒక ప్రణాళిక ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల కోసం కష్టపడాలని ఎమ్మెల్యే సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మేము అక్రమ కేసులు పెట్టి ఉంటే.. ఈరోజు ఒక్క వైసిపి నాయకుడు కూడా బయట ఉండేవారు కాదని స్పష్టం చేశారు.

కార్పొరేటర్లు.. వీధి రౌడీలు..

నగరంలోని గుల్జార్‌పేటలో టిడిపి జెండా దిమ్మెను తొలగించిన అంశంపై ఎమ్మెల్యే దగ్గుపాటి తీవ్రంగా స్పందించారు. అసలు అక్కడ కార్పొరేటర్ కుమారుడికి ఏం పని ఉందని ప్రశ్నించారు. పైగా సోషల్ మీడియాలో రప్పా..రప్పా..అంటూ కామెంట్ పెడతారా అంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేస్తే 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే అనంత వెంకట్రామిరెడ్డి తమ కార్యకర్తలను రెచ్చగొట్టి స్టేషన్‌పైకి పంపించారన్నారు. అక్కడ వైసిపి నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు ఒక వీధి రౌడీల్లా పోలీసులపై దూషణలకు దిగారన్నారు. అసలు పోలీసులపై దౌర్జన్యం ఎలా చేస్తారని ఆయన నిలదీశారు. తాము అక్రమ కేసులు పెట్టి ఉంటే ఒక్క వైసీపీ నాయకుడు కూడా ఇప్పుడు ఇలా రోడ్ల మీదకు వచ్చి మాట్లాడేవారు కాదన్నారు. మేము మీ లాగా రౌడీయిజం చేయాలనుకుంటే ఒక్క క్షణం పట్టదని.. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ దిశగా ఉండకూడదని.. రాష్ట్రంలో ఒక ప్రశాంతమైన వాతావరణం ఉండాలని సూచిస్తున్నారన్నారు.

నారాయణపురం భూమి వివాదంలో వాస్తవాలు ఇవే..

నారాయణపురం పంచాయతీలో భూమి కబ్జా అంటూ వస్తున్న వార్తల మీద ఎమ్మెల్యే దగ్గుపాటి క్లారిటీ ఇచ్చారు.. వాస్తవంగా అక్కడ 2006లోని వెంచర్ వేశారని అప్పట్లో కొంత స్థలాన్ని పంచాయతీకి కేటాయించారని.. ఇందుకు సంబంధించిన పత్రాలు కూడా ఉన్నాయన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే నివేదిక కోరామని చెప్పారు. వీఆర్వో తో పాటు పంచాయతీ అధికారులు కూడా దీనిపై స్పష్టత ఇచ్చారన్నారు. 2006 లోనే పంచాయతీకి భూమి కేటాయించగా అందులో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అంతేకానీ ఇక్కడ ఎవరు భూమిని ఆక్రమించలేదని.. దీనిపై అధికారులు కూడా పూర్తి స్పష్టతతో ఉన్నారన్నారు.

బీటెక్ పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న అధికారులు

జెఎన్‌టియు బీటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో అక్టోబర్‌లో నిర్వహించిన బీటెక్ 4వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్.20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు, బీటెక్ 4వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్.19), (ఆర్.15) సప్లిమెంటరీ, బీటెక్ 4వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆర్.19), (ఆర్.15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య ఆదేశాలతో విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగప్రసాద్ నాయుడు తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntuaresults.inను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఎపి.శివకుమార్, అడిషినల్ కంట్రోలర్లు జి.శంకర్ శేఖర్‌రాజు, శ్రీధర్, ఎం.అంకారావు, తదితరులు తెలిపారు.

గ్రామ కమిటీల నిర్మాణంతోనే బలోపేతం

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

గ్రామస్థాయిలో కమిటీల నిర్మాణం జరిగితేనే పార్టీ మరింత బలోపేతం అవుతుందని శింగనమల నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త సాకే శైలజనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో పార్టీని బలపరిచి వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మరోసారి సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, జడ్పిటిసి భాస్కర్, పూల నారాయణస్వామి, సర్పంచు పార్వతి, చికెన్ నారాయణస్వామి, ఎస్సీ సెల్ నాయకులు వడియంపేట అంజి, కాటమయ్య, గంగరాజు, మండల కన్వీనర్లు, అబ్జర్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరమ్మ సేవలు మరువలేనివి..

కలెక్టర్ ఓ.ఆనంద్

ఉమామహేశ్వరమ్మను సన్మానిస్తున్న కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం ఆవరణంలో మంగళవారం సాయంత్రం పదవీ విరమణ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మకి ఆత్మీయ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ జిల్లాలో తాను పనిచేసిన రెండు మూడు నెలల్లో బాగా పని చేశారని పేర్కొన్నారు. ఎక్కువ శాతం వ్యవసాయంపై ఆధారపడిన జిల్లాలో జిల్లా వ్యవసాయ అధికారిగా చాలా ప్రశాంతంగా పని చేశారన్నారు. ప్రభుత్వ సేవలో 34 ఏళ్లు పని చేశారని, పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. తనకు సహకారం అందించడం పట్ల కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ దంపతులను జిల్లా కలెక్టర్, తదితరులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ అశోక్ కుమార్, ఆత్మ పిడి పద్మలత, ఉద్యాన శాఖ డిడి ఉమాదేవి, ఎపిఎంఐపి పిడి రఘునాథ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుమ్ముద, ఎడిఏలు అల్తాఫ్ అలీ ఖాన్, ఎమ్.రవి, పద్మజ, సత్యనారాయణ, వెంకట్రాముడు, వ్యవసాయ శాఖ అధికారులు వెంకటకుమార్, వాసుప్రకాష్, కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసంఘాల అభివృద్ధే లక్ష్యం : ఏపిఎం

ప్రజాశక్తి-కుందుర్పి

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం సర్దానప్ప

గ్రామసంఘాలను అభివృద్ధి చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎపిఎం సర్దానప్ప తెలిపారు. మంగళవారం స్థానిక అమ్మ మండల సమైక్య కార్యాలయంలో సంఘం అధ్యక్షురాలు నీలాబాయి ఆధ్వర్యంలో ఈనారి, సిఆర్‌పిలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో సంఘం సభ్యుల జీవనోపాదులు, ఆర్థిక ప్రగతి పెంపుదల చేసుకునేందుకు ప్రతి 10 సంఘాల కోసం ఒక ఈనారిని నియమిస్తున్నట్లు తెలిపారు. విఒలో 25 సంఘాలలోపు ఉంటే ఈనారి ఇద్దరి మాత్రమే ఎంపిక చేయాలన్నారు. అలాగే విఒలో అదనంగా ఇద్దరు జీవనోపాదులకు సంబంధించి సిఆర్‌పిని సెలెక్ట్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు, వీవో లీడర్లు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుత్తి

మాట్లాడుతున్న మోహన్‌నాయక్

ప్రభుత్వ వసతి గహాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మాట్లాడుతూ ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ బీసీ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వడం లేదన్నారు. మెనూను పాటించడం లేదన్నారు. విద్యార్థులకు ఆదివారం బిర్యాని, గోంగూర పెరుగు పచ్చడి ఇవ్వాలని ఉండగా నాసిరకమైన చికెన్ ఇస్తున్నారని చెప్పారు. ఇటీవల ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజి మాలాదేవి ప్రభుత్వ పాఠశాలలు వసతి గహాలను తనిఖీ చేపట్టినప్పటికీ అక్కడ తీరు మాత్రం మారడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాయనమైన భోజనాన్ని ఇవ్వాలన్నారు. అలాగే మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను కలుపుకుని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, మణికంఠ, చంటి, అశోక్, రమేష్, రామకృష్ణ, ధర్మకుమార్, అశోక్, రాజశేఖర్, రమణ, అంజి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-గుంతకల్లు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం పట్టణంలోని రాజేందర్ నగర్‌లో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఆలయాన్ని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూలతో అలంకరణలు చేశారు. మూడు గంటల నుంచి భక్తులు ఉత్తర ద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించి శ్రీవారిని దర్శించుకోవడానికి బారులుదీరారు. ఆలయం లోపల, వెలుపల సీసీ కెమెరాలు ఆలయ కమిటీ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా కోదండరామ స్వామి ఆలయంలో కూడా భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కసాపురం గ్రామంలోని లక్ష్మీ నారాయణస్వామి రాతి ఆలయంలో భక్తులు వైకుంఠ ఉత్తర ద్వారంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

రీ సర్వేకు సహకరించండి : తహశీల్దార్

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని రైతులు రీసర్వేకు సహకరించి భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహశీల్దార్ శేషారెడ్డి కోరారు. ఈనెల 2వతేదీ నుంచి మండలంలోని చీలేపల్లి, ఆనందరావుపేట గ్రామాల్లో చేపట్టనున్న రీసర్వే నేపథ్యంలో ఆయా గ్రామాల్లో మంగళవారం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభల్లో తహశీల్దార్ మాట్లాడుతూ రీసర్వేలో అధికారులకు రైతులు సహకరిస్తే భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. మీకు కేటాయించిన తేదీల్లో అధికారులు సర్వేకు వచ్చినప్పుడు భూములకు సంబంధించిన పత్రాలను సమర్పించాలన్నారు. అంతేగాకుండా ప్రతి రైతు తప్పనిసరిగా అందుబాటులో ఉండి సర్వే చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ నారాయణస్వామి, మండల సర్వేయర్ స్టీఫెన్ వరకుమార్, విఆర్‌ఒలు, స్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన : ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్రంలో అభివద్ధి, సంక్షేమ పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర అభివద్ధిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రాన్ని గాడిలో పెట్టే బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్నారని చెప్పారు. కదిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రభుత్వం హితోదికంగా సాయం అందిస్తోందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందని తెలియజేశారు.

సాగునీరివ్వడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-పుట్లూరు

జిల్లాలోని రైతులకు సాగునీరు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎపి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిరుతల మల్లికార్జున విమర్శించారు. మంగళవారం మండలంలోని చింతకుంట గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరువుకు నిదర్శనమైన అనంతపురం జిల్లాలో ప్రాజెక్టులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం జాప్యం చేయడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యల్లనూరు, పుట్లూరు మండలాలకు నీరు అందించే సుబ్బరాయ సాగర్‌కు నీరు సమృద్ధిగా చేరుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.నారాయణస్వామి, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు విటి.రామాంజనేయులు, ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి రామకృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాము, పుట్లూరు మండల అధ్యక్షులు గోపాలకృష్ణ, మండల కార్యదర్శి సత్తార్ గోపాల్ యాదవ్, మండల గౌరవాధ్యక్షులు టి.బాల గురయ్య, ఉపాధ్యక్షుడు బూసగాని చిన్ని కష్ణ యాదవ్, చిన్న కులాయప్ప, పూలరంగడు, వీరయ్య, ఓబుల్ రెడ్డి, నాగయ్య, చిన్న ఓబులయ్య, పెద్దఓబులయ్య, నరసింహుడు వెంకట రాముడు, అజయ్, కుల్లాయప్ప, రామకష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త చక్రపాణి మంగళవారం మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు బ్రాహ్మణపల్లికి చేరుకుని చక్రపాణి భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు చిన్న నాయుడు రూ.5వేలు ఆర్థికసాయం అందించారు.

నేడు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండల వ్యాప్తంగా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఒక రోజు ముందుగానే ప్రభుత్వం పింఛన్లను పంపిణీ చేయనుంది. ఇందులో భాగంగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు. బండ్లపల్లి పంచాయతీ నారాయణపురం బైరాపురం పంచాయతీ సాయి నగర్ క్రాసు, గౌనుకుంటపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

స్వయం సహాయక సంఘం సభ్యులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని స్వయం సహాయ సంఘంలోని మహిళలకు అర్బన్ హెల్త్ మిషన్ (ఎన్‌యుహెచ్‌ఎం) మద్దతుతో ఎంఇపిఎంఎ 'సఖి సురక్ష' కింద మంగళవారం స్థానిక మారుతీనగర్‌లో ఉన్న కమ్యూనిటీ రీసోర్స్ సెంటర్‌లో ఉచితంగా 16 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, మెప్మా సిబ్బంది, స్లమ్ సమాఖ్య రీసోర్స్‌పర్సన్లు, స్లమ్ సమాఖ్య లీడర్లు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పాల దిగుబడిపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పాల దిగుబడిపై పశు పోషకుల్లో అవగాహన కల్పించాలని బుక్కరాయసముద్రం ప్రాంతీయ వైద్యశాల సహాయ సంచాలకులు ఎవి.రత్నకుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో పశు సంవర్ధక శాఖ సబ్ డివిజనల్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 7, 8, 9వ తేదీల్లో జరగనున్న పాల దిగుబడి పోటీలపై రైతులకు వివరించాలన్నారు. తమ పరిధిలోని బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లోని పశు పోషకుల్లో పాల దిగుబడి పోటీల్లో పాల్గొనేందుకు తగి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పశువైద్యాధికారులు గోవిందరాజు, శ్వేత, సాయిసుప్రజ, పశు వైద్య సహాయకులు, గోపాల మిత్రలు, పారా సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

'పది' విద్యార్థులపై ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-మడకశిర రూరల్

పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రభుత్వం ప్రతి పాఠశాలలో వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తుంది. అందులో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యం పెంచేందుకు ఉపాధ్యాయ బృందం కృషి చేస్తుంది. దీని వల్ల సి, బి గ్రేడ్ విద్యార్థుల ఉత్తీర్ణత పెంచడమే కాకుండా ఎ గ్రేడ్ విద్యార్థులు ఇంకా మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటు న్నారు. ఈ క్రమంలో మండల పరిధిలోని పాపసానపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ కృష్ణ ఉపాధ్యాయులతో కలిసి ప్రతిరోజూ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను కలిసి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు మీ వంతు సహకారం ఇవ్వాలని కోరుతున్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం కదిరేపల్లి, ఉగ్రేపల్లి, కంబాలపల్లి, కోడిగానపల్లి, కోతులగుట్ట, పాపసానపల్లి, తదితర గ్రామాలకు వెళ్లి మీ పిల్లలు సమయం వృథా చేయకుండా ఇంటి వద్ద బాగా చదివించాలని తల్లిదండ్రులను కోరు తున్నారు.

టిడిపి పట్టణ అధ్యక్షులుగా టాటా హాజీవలి

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా టాటా హాజీవలి నియమితులయ్యారు. పట్టణానికి చెందిన హాజీవలి పార్టీపై అభిమానంతో నిబద్ధత కలిగిన కార్యకర్తగా కొనసాగారు. అంతేగాకుండా గత వైసిపి ప్రభుత్వంలో అనేక అక్రమ కేసులు, దాడులను ఎదుర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించిన టిడిపి అధిష్టానం పార్టీ పట్టణ అధ్యక్షులుగా నియమించింది. దీంతో తన నియామకానికి సహకరించిన మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గుత్తికోటపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి కోటను అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రభుత్వానికి తగదని గుత్తికోట సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి వై.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక గుత్తికోట వద్ద గుత్తికోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపేట గ్రామం నుంచి గుత్తికోటపైకి రహదారిని నిర్మించాలన్నారు. కోటలో విద్యుత్తు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గుత్తి కోటకు రోప్ వే నిర్మించాలన్నారు. గుత్తి కోటకు సౌకర్యాలను కల్పిస్తే పర్యాటకులు పెరుగుతారన్నారు. గుత్తికోటలో పురాతన ఆలయాలు, కట్టడాలను స్వార్థపరులు ధ్వంసం చేశారని, వాటిని పునర్మించాలన్నారు. కోట వద్ద హరిత హోటల్, పార్కులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గుత్తికోటను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి ఉపాధ్యక్షుడు కాశీరావు కన్వీనర్ కోటేశ్వరరావు, నాయకులు సతీష్, విజయ్, నిఖిల్, సుధాకర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న గుత్తికోట సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి వై.రాజశేఖర్‌రెడ్డి

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటాం

ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

ప్రజాశక్తి-కొత్తచెరువు



నివాళు లర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, నాయకులు

మండల పరిధిలోని మీర్జాపురం గ్రామానికి చెందిన ఎరుకల హనుమంతు కుమారుడు చరణ్(15) తలమర్ల ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివేవాడు. గత సోమవారం చరణ్ పాఠశాల సమీపంలో బహిర్భూమికి వెళ్లి అక్కడే ఉన్న ఓ బావిలో పడి మృతి చెందాడు. విషయం తెలిసిన వెంట నే ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి స్పందించి బావిలో పడిన విద్యార్థి చరణ్ మృతదేహాన్ని తక్షణం వెలికితీయాలని స్థానిక పోలీసులు, ప్రభుత్వ అధికారులకు సూచించారు. దీంతో పోలీసులు చరణ్ మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. ఆ విద్యార్థి అంత్యక్రియలు మంగళవారం నిర్వహించగా వారు హాజరై విద్యార్థి మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. విద్యార్థి ఇలా మృతి చెందడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కన్నీటి పర్యంతమైన విద్యార్థి తల్లిదండ్రులు హనుమంతు, సాయమ్మను ఎమ్మెల్యే పరామర్శించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట టిడిపి మండల కన్వీనర్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు, రామకృష్ణ, తలమర్ల సింగిల్‌విండో అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, శీన, సాలెక్కగారి శ్రీనివాసులు, రమేష్‌రెడ్డి, సూరి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) నూతన క్యాలెండర్, డైరీని శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు డి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. రాబోయే కొత్త సంవత్సరంలో ఉపాధ్యాయులు ప్రభుత్వ ప్రతిష్ట దేశవ్యాప్తంగా కీర్తించే విధంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, రవివర్ధన్ రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ సునీల్ కుమార్, జిల్లా మున్సిపల్ సబ్ కమిటీ కన్వీనర్ మధుసూదన్, యుటిఎఫ్ జిల్లా క్రీడల కమిటీ కన్వీనర్ ఆజమ్ బాషా, సిపిఎస్ సబ్ కమిటీ కో కన్వీనర్ సంతోష్, హేమసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట